
విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై సంపూర్ణ సమాచారాన్నిచ్చే అగ్రగామి తెలుగు పక్షపత్రిక

వెల: రూ. 10/- 16 - 31 మే 2005

విద్య

ఉద్యోగ విజయాల పక్షపత్రిక





కాలేజీలో కాలు పెట్టకుండా ఐ.ఎ.ఎస్. సాధించిన ఆదర్శమూర్తి నందివెలుగు ముక్తేశ్వరరావు విజయకేతనం

లోపలి పేజీల్లో .....

అన్ని పోటీ పరీక్షలకు ప్రత్యేకం

THE ONE AND ONLY TELUGU EDUCATION MAGAZINE RECOGNISED BY THE INDIAN NEWS PAPER SOCIETY

కాలేజీలో కాలు పెట్టకుండా ఐ.ఎ.ఎస్. సాధించిన ఆదర్శమూర్తి



సమస్యలకు ఆయన భయపడలేదు... ఎదురొడ్డి పోరాడారు... అనుకున్నది సాధించారు... చదువుకోవడానికి పుస్తకాలు కూడా కొనలేని కుటుంబ ఆర్థిక పరిస్థితిలో... కేవలం ఒక్క నోట్ పుస్తకంతోనే సంవత్సరం మొత్తం గడిపేవారు. అంతేకాక ఆర్థిక పరిస్థితులు అనుకూలించక పోవడంతో పదవతరగతిలోనే బడి మానేశారు. ఏనాడు కాలేజి మెట్లెక్కలేదు. తండ్రిగారి వృత్తైన పూజారి బాధ్యతలు చేపట్టి కుటుంబానికి ఆసరాగా నిలిచారు. కానీ ఐఎఎస్ కావాలనే లక్ష్యాన్ని మాత్రం ఏనాడు మరువలేదు. "కాలేజీకి వెళ్ళే అవకాశమే లేదు!... ఇంకెక్కడ ఐఎఎస్ అధికారి నవుతా?" అని నిరుత్సాహ పడలేదు. పట్టుదల వీడకుండా ప్రైవేటుగా ఇంటర్, డిగ్రీ పూర్తి చేశారు. సివిల్స్‌కు ప్రయత్నించి మొదటిసారి విఫలమయ్యారు. మొదటి ప్రయత్నం విఫలం కావడంతో పట్టుదల మరింత పెరిగింది. ఓటమి మిగిల్చిన మానసిక వత్తిడిని తట్టుకుంటూ ఎపిపియస్‌సి పరీక్షలు రాసి సెలెక్ట్ అయ్యారు. పట్టుదల ఉంటే ఏ పరిస్థితులు విజయానికి అడ్డురావని నిరూపించారాయన. ఉన్నతాధికారిగా బాధ్యతలు చేపట్టినా ఏనాడూ అధికారిననే అహంభావం తన దరిచేరనీయలేదు. ఎక్కడ పనిచేసినా ప్రజలతో మమేకమవడం ఆయన ప్రత్యేకత. ప్రభుత్వాధికారి అంటే ప్రజలకు సేవచేసే సేవకుడిగా మాత్రమే భావిస్తుంటారు. ఐఎఎస్ అధికారి హోదాను ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా భావిస్తారాయన. ఇంతటి ఉన్నత విలువలు కలిగిన వ్యక్తి మరెవరో కాదు ప్రస్తుతం తిరుమల తిరుపతి దేవస్థానం జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఐ.ఎ.ఎస్ అధికారి శ్రీ నంది వెలుగు ముక్తేశ్వరరావు. ఈ పక్షం 'విద్య' పాఠకులకు శ్రీ నంది వెలుగు శ్రీ ముక్తేశ్వరరావు ఇంటర్వ్యూ విజయకేతనంలో అందిస్తున్నాం. స్వీకరించండి.

విజయకేతనం

సంచలనాలకు ఆయన కేంద్ర బిందువు



ప్ర: ముక్తేశ్వరరావు గారు! మీ బాల్యం, విద్యాభ్యాసం గురించి వివరిస్తారా?

జ: మా స్వస్థలం గుంటూరు జిల్లా రేపల్లె సమీపంలోని భట్టిప్రోలు మండలంలోని ఓలేరు గ్రామం. నాన్నగారు కాశీవిశ్వనాధశాస్త్రి గారు. అమ్మగారు హైమవతిగారు. 19 మే 1956వ సంవత్సరంలో జన్మించా. నాన్నగారు పూజారిగా చేసేవారు. మాది చాలా నిరుపేద కుటుంబం. మేము ఆరుగురం అన్నదమ్ములం. అక్కచెల్లెళ్ళం. నాన్నగారు పూజారిగా పని చేస్తే వచ్చే అరకొర ఆదాయంలోనే అందరం బ్రతికే వాళ్ళం. దాంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాము. ఇక విద్యాభ్యాసం విషయానికి వస్తే... నా స్కూలు విద్యాభ్యాసం స్వగ్రామంలోనే సాగింది. స్కూలుకు వెళితే పుస్తకాలు కొనుక్కోవడానికి డబ్బులు ఉండేవి కాదు. కేవలం ఒక్క నోట్ పుస్తకం కొనుక్కొని సంవత్సరం మొత్తం ఆ పుస్తకంతోనే సరిపెట్టుకునే వాడిని. కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా పదవ తరగతిలోనే స్కూలు మానేశా. నాన్నగారితో పాటుగా పూజారిగా చేస్తూ ఇంటి వద్ద పిల్లలకు ట్యూషన్‌లు చెప్పేవాడ్ని. నాకు చిన్నతనంనుండి ఐఎఎస్ అధికారి కావాలనే కోరిక బలంగా ఉండేది. అందుకే ప్రైవేటుగా ఇంటర్, డిగ్రీ చదివా. ప్రైవేటుగానే ఎం.ఎ. తెలుగు, ఇంగ్లీషు పూర్తిచేశాను. ఎక్కడా కోచింగ్ తీసు కోలేదు. 1983వ సంవత్సరంలో సివిల్స్‌కు ప్రయత్నించి విఫలం అయ్యా. అయినా నిరుత్సాహపడలేదు. వివాహం అయిన తరువాత 1985వ సంవత్సరంలో ఎపిపిఎస్‌సి పరీక్షలు వ్రాసి మంచి మార్కులు సాధించి సేల్స్‌టాక్స్ విభాగంలో ప్రవేశించా.

ప్ర: చిన్నతనం నుండే ఐఎఎస్ అధికారి కావాలనే కోరిక ఉండేదన్నారు కదా! మీ ఆశయం వెనుక స్ఫూర్తి ఎవరు?

జ: నేను చిన్నతనంలో చూసిన 'తాసీల్దార్ గారి అమ్మాయి' సినిమాలో కలెక్టర్‌కు ఉన్న హోదా, గొప్పతనం చూసి నేనుకూడా ఎప్పటికైనా కలక్టర్ కావాలనే కోరికకు నాలో బీజం పడింది. అయితే నాకు స్ఫూర్తినిచ్చిన వ్యక్తులు ఇద్దరు. ఒకరు మానాన్నగారు శ్రీ కాశీవిశ్వనాథ శాస్త్రి గారు. రెండవ వ్యక్తి మా అన్నయ్య శ్రీ శివరావు గారు. వీరిద్దరి నుండి నేను ఎంతో నేర్చుకున్నాను. నాన్నగారు అర్చకులైనా ఏనాడు కుల, మత తారతమ్యాలు చూపలేదు. సమాజంలో అందరితో కలిసిమెలసి ఉండడం, అందరినీ సమానంగా చూడడం నాన్నగారి వద్దనుండే నేర్చుకున్నాను. అంతే కాకుండా ఎన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ ఇంట్లో పిల్లలందరినీ ఎంతో ప్రేమగా పెంచారు. అదే విధంగా అన్నగారైన శివరావుగారి నుంచి ఎంతో క్రమశిక్షణ నేర్చుకున్నాను.

ప్ర: మీరు ఎపిపిఎస్‌సికి ఎంపికయ్యారు కదా! ఐఎఎస్ అధికారిగా ఎప్పుడు బాధ్యతలు చేపట్టారు?

జ: నేను 1985వ సంవత్సరంలో ఎపిపిఎస్‌సి ద్వారా సేల్స్‌టాక్స్ డిపార్ట్‌మెంట్‌లో జాయిన్ అయ్యాను. 1987వ సంవత్సరంలో సిటిఓగా, 1990వ సంవత్సరంలో డిప్యూటీ కలెక్టర్‌గా 2002వ సంవత్సరంలో ఐఎఎస్ అధికారిగా పదోన్నతి పొందాను. నేను ఇప్పటివరకు గుంటూరు, కందుకూరు, వికారాబాద్, మదనపల్లె, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఇలా పలు చోట్ల ఎన్నో బాధ్యతలు నిర్వహించాను.

ప్ర: మీ జీవితంలో మరిచిపోలేని సంఘటనలు ఏమైనా ఉన్నాయా?

జ: నా జీవితంలో మరచిపోలేని సంఘటనలు చాలా ఉన్నాయి. నేను మదనపల్లెలో ఆర్.డి.ఓగా పనిచేసే సమయంలో రోజుకు నాలుగు వందల నుండి ఐదు వందల వరకు వివిధ సమస్యలపై పిటీషన్లు వచ్చేవి. ఆ సమయంలో వాటిని పరిష్కరించడానికి వినూత్న కార్యక్రమం చేపట్టాము. దానిపేరు "ప్రజా దర్బార్" అని పెట్టాము. అధికారులు అందరం ప్రజా దర్బార్‌లో ఉండేవాళ్ళం. చిన్న చిన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కారించేవాళ్ళం. ఉదాహరణకు పట్టాదారు పుస్తకంలోనో, మరో దానిలోనో తండ్రిపేరు తప్పుపడిందనుకోండి. దానిని తీసుకొని ఎం.ఆర్.ఓ వద్దకు వెళ్ళాలి. ఆ సమయంలో విలేజ్ అసిస్టెంట్ ఉండడు. విలేజ్ అసిస్టెంట్ ఉంటే మరో అధికారి ఉండడు. ఇలా సదరు వ్యక్తి ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిరగవలసి వచ్చేది. మేము ప్రజల వద్దకు వెళ్ళినప్పుడు ఎం.ఆర్. ఓ, విలేజ్ అసిస్టెంట్, ఆర్.ఐ ఇలా అధికారులం అందరం ఉండేవాళ్ళం కాబట్టి ఆ సమస్యను వెంటనే తీర్చేవాళ్ళము. ఇలా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారికి అవసరమైన పనులు సత్వరమే చేసేవాళ్ళం. ఈ కార్యక్రమం ప్రారంభంలో అధికారులనుండి కొంత వ్యతిరేకత వ్యక్తమయ్యింది. కాని నేను అధికారులందరికీ నచ్చచెప్పాను. మనకు జీతాలు ఇస్తున్నది ప్రజలు. వారికి సేవ చేయడం మన కర్తవ్యం

విజయకేతనం

జీతాలిస్తున్న ప్రజలకు సేవ చేయడం మన కర్తవ్యం

అని చెప్పి అధికారులను ప్రజలకు దగ్గర చేశాను. అదే సమయంలో ప్రజలు తప్పుచేస్తే అధికారులకు అండగా నిలిచేవాడ్ని. ఇలా ఈ కార్యక్రమం ఒక సంవత్సర కాలం పాటు నడిచింది.


తరువాత చిత్తూరు జిల్లాలో డి.ఆర్.డి.ఎ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పనిచేసే సమయంలో సుమారు రెండు లక్షల మంది మహిళలను చైతన్య వంతులను చేయడం జరిగింది. స్త్రీలలో ఆత్మస్థైర్యం నింపి వారి కాళ్ళపై వాళ్ళు నిలబడే విధంగా చేశాము. మీరు ఎవరి కోసం కష్టపడవద్దు. "మనకోసం మనం" అనే భావనను మహిళలకు చెప్పి చైతన్యవంతుల్ని చేసి తద్వారా వారు అభివృద్ధి వైపు పయనిం చేలా చర్యలు చేపట్టాం. ఇంట్లో స్త్రీలు అభి వృద్ధి చెందితే కుటుంబం బాగుటుంది. తద్వారా రాష్ట్రం, దేశం బాగుపడుతుంది. అందుకే మహిళలలో చైతన్యం తీసుకు రావ డానికి ప్రయత్నించాం.

అదిలాబాద్ జాయింట్ కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో సుమారు 25వేల ఎకరాల భూమిని పేదలకు పంచాము. గ్రామాలలో ఉన్న గుడికట్టు భూమిని ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలుగకుండా అందరి సహకారంతో నిరుపేదలకు పంచాము.

అదే విధంగా పశ్చిమగోదావరి జిల్లాలో ఐ.టి.డి.ఎ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పనిచేసే సమయంలో గిరిజనులకోసం 'భూమి వాచకం' అనే పుస్తకం ప్రచురించాము. దీని ద్వారా గిరిజనులకు తమ భూమి ఎక్కడ ఉంది. భూమిపై తమకున్న హక్కులు ఏమిటి అన్న విషయాలపై అవగాహన కల్పించాము. గిరిజనులందరినీ ఒక్కటిగా చేసి వారిలో మార్పు తీసుకువచ్చేందుకు ప్రయత్నించాము. వారి భూములపై వారికి అవగాహన కల్పించే ప్రయత్నంలో వారిలో ఒకడిగా కలసిపోయి జీవించాను. ఇలా నేను పనిచేసిన ప్రతి చోటా నాకు మరచిపోలేని జ్ఞాపకాలు ఎన్నో ఉన్నాయి.

ప్ర: ఒక ప్రభుత్వ అధికారిగా ప్రజలకు అత్యంత చేరువగా, వారితో మమేకమై మీరు బాధ్యతలు నిర్వహిస్తున్నారు కదా! అటు ప్రజలకు, ఇటు అధికారులకు ఒకే సమయంలో సన్నిహితంగా మెలగడం ఎలా సాధ్యమయ్యేది?

జ: నా దృష్టిలో అధికారి అంటే ఒక ప్రత్యేకమైన వ్యక్తి కాదు. అధికార హోదా అనేది కేవలం ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధి మాత్రమే. నేను ఐఎఎస్ హోదాను కేవలం ప్రజలకు సేవచేయడానికే అని భావిస్తాను. ప్రజలే మాకు జీతాలు ఇస్తున్నారు. మేము వారి సేవకులం. వారి సమస్యలను పరిష్కరించడం మా బాధ్యత. అందుకే నేను ప్రజలకు చేరువగా నిత్యం వారి మధ్యలో ఉండి వారికి సేవ చేయడానికి ప్రయత్నిస్తుంటాను. కేవలం నేను ఒక్కడినే కాదు నాతో పనిచేసే అందరూ అదే విధంగా ఉండేలా చర్యలు తీసుకుంటాను. అధికారులనుండి మొదట్లో వ్యతిరేకత వ్యక్తమయినా వారికి నచ్చచెప్పి ప్రజల వద్దకు తీసుకువెళ్ళడం ఎక్కడున్నా నాకు అలవాటు. ప్రజల సమస్యలు తీరిస్తే వారు చూపే ఆదరాభిమానాలు చూసి తోటి అధికారులు కూడా ఎంతో సంతోషించేవారు. నేను ఎక్కడ పనిచేసినా రైతులకు, మహిళలకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తుంటాను. రైతులు బాగుంటే దేశం బాగుంటుంది. అదే విధంగా మహిళలు సాధికారత సాధిస్తే కుటుంబం, తద్వారా రాష్ట్రం, దేశం బాగుపడతాయి. అందుకే నేను ఈ ఇద్దరికీ ఎక్కువ ప్రాధాన్యతనిస్తుంటాను. ఇప్పటి వరకు నేను పనిచేసిన నాలుగు జిల్లాల్లో సుమారు నాలుగు లక్షల మందికి పట్టాదారు పాసు పుస్తకాలు ఇప్పించడం జరిగింది. అధికారులమన్న భావాన్ని అధికారులలో తొలగించి ప్రజా సేవకులమనే భావాన్ని అధికారులలో పెంచడం వల్లనే ఇదంతా సాధ్యమవుతోంది.



ప్ర: మీకు సాహిత్య రంగంలో కూడా ప్రవేశం ఉన్నట్లుంది! ఇప్పటి వరకు మీరు రాసిన కవితలు, పుస్తకాల వివరాలు తెలియజేస్తారా?

విజయకేతనం

జ: నేను చదుకునే రోజులలో ఎక్కువగా గ్రంథాలయాలపైనే ఆధారపడేవాడ్ని. ఎన్నో పుస్తకాలు చదివేవాడ్ని. ఆ భావావేశంతోనే 14వ ఏట విద్యావిధానంపై ఒక కవిత రాశాను. అలా మొదలైన సాహిత్యాభిలాషతో ఇప్పటి వరకు 35 పైగా కవితలు రాశాను. "చదువు ఎందుకు?" "మనం ఎందుకు పనిచేయాలి?", "ఆంధ్రప్రదేశ్ జనరల్ సేల్స్ టాక్స్ చట్టం" మొదలైన పుస్తకాలు రాశాను.

ప్ర: మీ కుటుంబం గురించి, మీ విజయం వెనక మీ శ్రీమతి సహకారం గురించి వివరిస్తారా?

జ: నాకు 1985వ సంవత్సరంలో వివాహం అయింది. నా శ్రీమతి పేరు హేమలత. మాకు ఇద్దరు బాబులు. ఒకపాప. పాపపేరు మాళవిక. బాబుల పేర్లు కార్తికేయ శ్రీనాధ్, శ్రీభరత్. నా విజయం వెనుక నా శ్రీమతి సహకారం విషయానికి వస్తే... పెళ్ళయిన తరువాతే నేను

ఐఏఎస్ హోదా ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధి మాత్రమే!



ఎపిపిఎస్‌సి ద్వారా ఉద్యోగానికి సెలెక్టయ్యాను. నా శ్రీమతి నా చదువు విషయంలో ఎంతో సహకరించింది. రాత్రి ఒంటిగంటకు లేవమంటే తాను ఒంటిగంట వరకు మెలకువగా ఉండి నన్ను లేపి టీ ఇచ్చేది. నేను ఈనాడు ఈ స్థితికి రాగలిగానంటే నా శ్రీమతి సహకారం మాటలలో చెప్పలేనిది. ఉద్యోగంలో చేరిన తరువాత కూడా ఆమె నాకు ఎంతో సహకరిస్తోంది. నేను ఏ పోస్టులోను ఎక్కువ కాలం ఉండేవాడ్ని కాదు. వెంట వెంటనే ట్రాన్స్‌ఫర్‌లు వచ్చేవి. అయినా ప్రతిసారి నాతోపాటు నేను ఎక్కడ ఉంటే అక్కడే తానుకూడా ఉండేది. ఇలా ప్రతి విషయంలోను తాను వెన్నంటి ఉండ బట్టే నేను ఇన్ని విజయాలు సాధించగలుగుతున్నాను. మేమిద్దరం ఒకరి అభిప్రాయాలను ఒకరు గౌరవించుకుంటాం. ఏ విషయావైనా ఇద్దరం కలసి చర్చించుకుని నిర్ణయం తీసుకుంటాం.

ప్ర: ప్రస్తుతం టిటిడి జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు?

జ: మా ఇఓగారి సహకారం, తోటి ఉద్యోగుల సహకారంతో తిరుమల తిరుపతి దేవస్థానాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకు వెళుతున్నాము. ప్రజలకు మరిన్ని సేవలు అందే విధంగా పలుకార్యక్రమాలను రూపొందించదలచుకున్నాము.

ప్ర: యువతకు మీరిచ్చే సందేశం?

జ: యువత శాస్త్రీయంగా ఆలోచించాలి. సంకల్ప బలంతో ముందుకు సాగాలి. సంకల్ప బలం లేకపోతే ఎవరూ ఏమీ చేయలేరు. నేను ఐఎఎస్ అధికార్ని కావాలని చిన్నతనం నుండి గట్టి సంకల్పంతో ఉండేవాడ్ని. ఐఎఎస్ కావాలనే సంకల్పం నాలో బలంగా ఉండబట్టే సాధించగలిగాను. మనం చేసేపనిలో నిబద్ధత ఉండాలి. జీవితం అనేది సమాజానికి సేవలందించేందుకే అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. ప్రాణం లేని చెట్లను చూడండి అవి ఇతరులకు ఎంతగా ఉపయోగపడతాయో! చెట్లే అంత పరోపకారం చేస్తుంటే విచక్షణాజ్ఞానం కలిగి ఉన్న మానవుడు ఎంత పరోపకార బుద్ధిని కలిగి ఉండాలో ఆలోచించండి. సమాజం వేరు, మనం వేరు కాదు. సమాజంలో భాగమే మనం. ఇది తెలుసుకుని ప్రతి మనిషి మనోబలంతో, సంకల్పబలంతో ముందుకు సాగాలి.

ప్ర: మన విద్యావిధానంపై మీ అభిప్రాయం?

జ: మన విద్యావిధానం చాలా బాగుంది. కాదనడంలేదు. అయితే మన విద్యావిధానంలో ఇంకా మార్పులు రావాలి. ప్రజలకు దగ్గరయ్యే విధంగా విద్యావిధానం ఉండాలి. ముఖ్యంగా వృత్తి విద్యా కోర్సులకు ప్రాధాన్యత ఉండాలి. ప్రజల జీవన విధానానికి అనుబంధంగా విద్య ఉండాలి. అంతేకాని విద్య అంటే కేవలం గుమాస్తాలను తయారు చేసేవిధంగా ఉండకూడదు. విద్య అనేది మనోసంకల్పాన్ని పెంచేదిగా ఉండాలి. మనిషిని ఉన్నత స్థితికి తీసుకువెళ్ళేదిగా ఉండాలి. పూర్వం గురుకులాలలో అలాంటి విద్య ఉండేది. ప్రస్తుత కాలంలో మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా మన విద్యావిధానంలో చిన్నచిన్న మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ప్రభుత్వాలు కూడా వృత్తి విద్యపట్ల శ్రద్ధ చూపాలి. విద్యార్థులలో సమాజం పట్ల సరియైన అవగాహన కల్పించేదిగా ఉండాలి 'విద్య'.

విజయకేతనం

ప్ర: మనదేశ అభివృద్ధిపై మీ అభిప్రాయం?

జ: మనదేశం అభివృద్ధి పథంలోనే పయనిస్తోంది. అందులో ఎలాంటి సందేహం లేదు. అయితే ఈ అభివృద్ధి అనుకున్నంత వేగంగా జరగడంలేదు. ప్రపంచ వ్యాప్తంగా మారుతున్న పరిస్థితులు ప్రజల జీవన విధానంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. గ్లోబలైజేషన్ ప్రభావం వలన అనవసరమైన అంశాలకు ప్రాధాన్యత పెరుగుతోంది. ఈ పరిస్థితిలో మనలో మార్పు రావాలి. మనంతట మనం అభివృద్ధి చెందే దిశగా ప్రయత్నించాలి.

ఎంతో బిజీగా ఉండి కూడా శ్రీ నంది వెలుగు ముక్తేశ్వరరావు గారు "విద్య"పై మమకారంతో "విద్య" కు ప్రత్యేక ఇంటర్వ్యూను ఇచ్చారు. అందుకు "విద్య" వారికి సదా కృతజ్ఞతలు తెలుపుకుంటోంది. అంతేకాక సదా వారి ఆశీస్సులు అర్థిస్తోంది, అభ్యర్థిస్తోంది.

★